# కట్నాలు వొద్దు, కానుకలు కూడా వొద్దు

"దయచేసి ఏ విధమైన కానుకలు తేవద్దని మనవి!" అని వుంది ఆహ్వానంలో. దిగువన ఒక లైనుకొట్టి దానికింద పెద్దక్షరాలతో అచ్చు వేశారామాట.

ఎవరూ ఏ విధమైన కానుకలూ తీసుకురాడం ఇష్టం లేకపోతే, అంత డబ్బు ఖర్చుపెట్టి ఫైవ్‌స్టార్ హోటల్ ఆవరణలో ఆడిటోరియం తీసుకోడం రిసెప్షను ఏర్పాటు చెయ్యడం యెందుకు-అనిపించింది నాకు ఆ కార్డులో ఆ లైను చదవగానే.

మరుక్షణంలో అంత గొప్ప వాళ్ళని అలా అనుమానించినందుకు నొచ్చుకున్నాను.

రామస్వామిగారు కేంద్రప్రభుత్వంలో ఉద్యోగి. ఒక మంత్రి గారికి పి. ఎ. గా వున్నారిప్పుడు. "లా" చదివి, ప్రాక్టీసు పెట్టడానికి కోర్టుచుట్టూ తిరిగి జడ్జీలనీ, మున్సబులనీ ఆనర్ల వోనర్లుగా తల ఊప డాని కిష్టంలేక ఎప్పుడో వొదిలేసిన షార్టుహాండు ఊతతో స్టెనోగ్రాఫరుగా చేరి, అలా అలా పరమపద సోపానపటం నిచ్చెనలెక్కి ఇంత వాడయ్యాడు. ఒక్కగానొక్క కొడుకు - ఒక పెద్ద కంపెనీకి జనరల్ మేనేజర్‌గా మొన్నే సెలక్టయ్యాడు. అతని పెళ్ళి.

మంత్రిగారికి ఈన యెంత చెబితే అంతేనని దేశం అంతా ప్రఖ్యాతైపోయింది. అందులోనూ పరిస్థితు లెలా వున్నాయంటే, మంత్రిగారే పియేదాకా అక్కర్లేదు. కేంద్ర ప్రభుత్వంలో చిన్న గుమాస్తా అయినా దేశాన్ని కదిలించే సందేశం ఇవ్వగలడు!

రామస్వామిగారు రొండు చేతులా సంపాదించేదని, ఆయన చిరునవ్వుకి, షేక్‌హాండుకి, కోరచూపుకి, గర్జనకి-దేని రేట్లు దాని కున్నాయని; కిట్టక చెప్పుకుంటారు జనం. నేన్నమ్మను.

ఎందుకంటే ఢిల్లీలో ఆయన వుండేది అద్దె ఇంట్లో. బెజవాడలో గవర్నరుపేట సెంటర్లో వున్న మేడ వాళ్ళావిడది. మద్రాసులో నెలకి

మూడు మేగజైన్లు అచ్చువేస్తున్న ఆఫ్‌సెట్ ప్రింటింగ్ ప్రెస్సు వాళ్ళ పెద్దల్లుడిది. హైదరాబాదు బంజారాహిల్సులో మూడంతస్తుల మేడ వాళ్ళ చిన్నల్లుడిది. గుడివాడలోనూ, తెనాలిలోనూ మార్కెట్ కాంప్లెక్సు భవనాలు ఆయన తమ్ముళ్ళవీ. చివరికి గుంటూర్లో సినిమాహాలు వాళ్ళ మేనల్లుడిదే కాని ఆయనది కాదు !

అంచేత ఏ విధమైన కానుకలు తేవద్దని కాకపోతే తెమ్మని మనవి చేస్తారా? అని నా కనిపించింది.

ఆయన ఎంత చిత్తశుద్ధితో మనవి చేసుకున్నా, అంత గొప్ప వాళ్ళింట్లో పెళ్ళికి వొట్టి చేతుల్తో వెళ్ళడమూ అంత "యిదిగా" కన బళ్ళేదు నాకు. రేపు మా ఇంట్లో ఏదేనా పెళ్ళి జరుగుతుంది. అప్పు డాయన ఏమీ తేకుండా వొస్తే నాకెంత చిన్నతనంగా వుంటుందో తల్చుకుంటే వొళ్ళు గరిపొడుస్తున్నాది. అదలా వుంచి, త్వరలో యు. పి. ఎస్. సి. పరీక్షలు రాస్తున్న మా పెద్దబ్బాయి ఉద్యోగ ప్రయ త్నంలో ఆయన ఎంతో సాయం చేస్తారని ఆశతో వున్నాం. అంచేత ఏదైనా కాకుండా, "ఏదో ఘనంగానే" యిద్దామని నిర్ణయించేను.

"అంతగా నలుగుర్లోనూ పుచ్చుగోకపోతే రిసెప్షను అయిపోయే దాకా వుండి విడిగా కలుసుకుని ఆయన చేతుల్లో పెట్టొచ్చు" అన్నాను మా ఆవిడతో.

"అసలు అలా విడిగా (రహస్యంగా కలుసుకొని) యివ్వడమే మంచిది !" అంది మా ఆవిడ. ఆమెకున్న ప్రపంచజ్ఞానం ప్రాప్త కాలజ్ఞత నాకు తెలీనివి కావు. అని స్ఫురించి మరోసారి చంకలు గుద్దుకున్నాను.

ఇద్దరం వెళ్ళేం.

రామస్వామిగారు టెర్లిన్ సూటోను, కనకమ్మగారు కంచిపట్టు చీరలోనూ ధగ ధగ లాడుతూ ఆడిటోరియం గేటు దగ్గర నిలబడి నమస్కారాలూ, షేక్‌హాండ్లూచేసి, థేంక్సులు చెప్పి అలసిపోయున్నారు.

మా ఆవిడ చేతుల్లో వున్న ఎర్రకాగితం పాకెట్టుచూసి పక్కనే ఉన్న వో చాకులాటి పిల్లకి సంజ్ఞ చేరింది. ఆ పిల్ల వెనకాల మేం వెళ్ళేం ఆడిటోరియం వెనకాలవున్న మీటింగు హాల్లోకి.

ఆ హాలు చాలలేదు కానుకలు పేర్చడానికి!

అక్కడ :—

మాకు ఏం చూడాలనుందో అన్నీ చూసేం కన్నుల పండుగగా....

బంగారపు నగలా! వెండిబొమ్మలా; కంచిపట్టు చీరలా; సోఫా సెట్లా! అజంతా ఖజురాహో బేలూరు శిల్పాల దంతపు రెప్లికాలా; అచ్చపు జపాన్ క్రాకరీలా; ఆటోమేటిక్ రిస్టువాచీలా, రిఫ్రిజిరేటర్లా! ఢిల్లీలో, ఆ మాటకొస్తే యావద్భారతదేశంలో "ఎనీబడీ హూ యీజ్ సమ్బడీ" యివ్వగలిగిన మహత్తరమైన వస్తు సముదాయం - ఉపయోగకరమైనవీ నిరుపయోగకరమైనవీ (క్షమించాలి: "ఆల్ ఆర్ట్ ఈజ్ క్వయిట్ యూస్‌లెస్!") ఎన్నో వున్నా యక్కడ. చూడడానికి మా కిద్దరికీ వున్న ఎనిమిది కళ్ళు చాల్లేదు. మా హంబుల్ ప్రెజంటేషన్-భార్యాభర్తల పవిత్ర అనుబంధం గురించి వేదం, కురాను, బైబిలు మొదలైన గ్రంథాలు ఏం చెబుతున్నాయో ఒక జర్మన్ తత్త్వవేత్త ఆంగ్లంలో రాసిన పుస్తకం (అయ్యో, అదీ తక్కువ వెలదికాదు; నూట యనభై రూపాయలది!) వాటిమధ్య వెలవెలబోతూ నిలబడిందక్కడ.

ఆనందంతో చెమర్చిన కళ్ళు తుడుచుకుంటూ ఇవతలికొచ్చి, "కేంద్రమంత్రిగారి పి. ఎ. గా ఉద్యోగం చెయ్యని జీవితమేల" అని వ్యథ చెందాం మా ఆవిడా, నేనూను.

"దీర్ఘాయుష్మాన్ భవ" అని వరుణ్ణి; "దీర్ఘ సుమంగళీభవ" అని వధువును ఆశీర్వదించి, వణుకుతున్న చేతుల్తో స్వీటు, హాటు, టీ స్వీకరించేం.

గొడవంతా ఒక్కసారి సన్నగిల్లితే అటు చూసేం.

మంత్రిగారు విచ్చేశారు!

వచ్చిన వాళ్ళలో అతి ముఖ్యుల్ని వారికి తప్పనిసరిగా పరిచయం చేసేక వధూవరులను ఉద్దేశించి వారన్నారు, "నేనొక ప్రెజెంటు తెచ్చాను మీకోసం !"

కంగారుగా వధూవరులు లేచి వారిని ప్రెజెంటేషన్లున్న మీటింగు హాలుకు స్వయంగా దారి చూపిస్తూ తీసుకుపోయారు. త్వరగా అడుగులు వేయగలిగినవారూ, గొప్పవాళ్ళ మధ్యని కూడా తోపులాటలో పాల్గొనడానికి వెనుదీయనివారూ మాలో కొందరం వారిని ఫాలో అయ్యాం.

వారిచ్చే ప్రెజెంటేషన్ కోసం మీటింగు హాలు మధ్యని ఒక పెద్ద టేబిలు ఖాళీగా వుంచారు. అక్కడికెళ్ళి వధూవరులు నిలబడి, వారికి వినయంగా నమస్కరించారు.

కోటు జేబులోంచి ప్లాస్టిక్ సంచిలో వుంచిన రెండు గులాబి పువ్వులను సుతారంగా బైటికితీసి, ఇద్దరికీ చెరోటీ అందించి, నెత్తికి ఎత్తుగా చెయ్యెంచి "ఆదర్శ దంపతులుగా కలకాలం వర్ధిల్లండి దేశమాత గర్వపడే సంతానాన్ని కనండి !" అన్నారు మంత్రిగారు.

ఇటు తిరిగి "మిస్టర్ రామస్వామి !" అన్నారు, నోటుబుక్కు షార్టుహాండ్ పెన్సిలు తేనందుకు బెంగెట్టుకున్న వాడిలా ఆయన సందేశం కోసం ముందుకొచ్చి వంగాడు రామస్వామిగారు.

"ఈ మీటింగ్ హాలులో పేర్చిన వస్తువులన్నీ మీ కొడుక్కీ కోడలుకీ మన దేశంలోని ప్రముఖు లిచ్చిన కానుకలు మినిస్టర్ పి. ఏ. గా ఉండుండకపోతే ఇవన్నీ కావు, ఇవేవీ రావు అనిపిస్తోంది. కాబట్టి ఈ వస్తువులన్నిటినీ నేషనల్ మ్యూజియంకి తరలించమని కోరుతున్నాను !" అని, తన వెంట వచ్చిన పోలీసు ఉన్నతాధికారికి ఆ బాధ్యత వొప్పగించి, మీటింగ్ హాలు గేటు దగ్గర తయారైై వున్న లిస్టును చేతపుచ్చుకు వెళ్ళారు మంత్రిగారు.

(19-11-77)